# రాంపల్లి ప్లాట్‌పై భారీ మోసం బయటపడింది



**కీసర,ఏప్రిల్17.అక్షర టైమ్స్:-**కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లి గ్రామం, దయానంద నగర్ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ప్లాట్ నెం.235పై భారీ రియల్ ఎస్టేట్ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ ప్లాట్ అసలు యజమాని గంగాధర వీరయ్య కాగా, ఆయన తన కూతురు లీలావతికి గిఫ్ట్ డీడ్ ఇచ్చారు. అనంతరం లీలావతి 29-03-2022న గంగి మల్లేష్‌కు విక్రయించగా, ఆయన స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నారు.ఇదిలా ఉండగా, ప్రధాన నిందితుడు నాంపల్లి ప్రభాకర్ రెడ్డి తన సహచరులతో కలిసి ఒరిజినల్ పత్రాలను దుర్వినియోగం చేసి, నకిలీ యజమానిని సృష్టించి 2004లో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ నకిలీ పత్రాలతో పలువురికి భూమిని అమ్మి డబ్బులు దోచుకున్నారు.ఈ కేసులో నాంపల్లి ప్రభాకర్ రెడ్డి (ఏ1), గుడిబాటి రమేష్ రెడ్డి (ఏ3), తుమ్మల మధుకర్ రెడ్డి (ఏ4)లను 17-04-2026న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మిగతా నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.పోలీసుల సూచనలు: భూమి కొనుగోలు ముందు పత్రాలు పూర్తిగా పరిశీలించాలని, యజమాని వివరాలు ధృవీకరించాలని, అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కీసర ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు సూచించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్ల

**- ఉప్పల్‌లో చెరువుల అభివృద్ధికి భారీ ప్రణాళిక**





**కాప్రా, ఏప్రిల్17. అక్షర టైమ్స్: -**ఉప్పల్ నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాప్రా చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.35 కోట్లతో పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.శుక్రవారం కాప్రా చెరువును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించిన పరమేశ్వర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఇప్పటికే ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులు రూ.20 కోట్లతో తుది దశకు చేరుకున్నాయని, అలాగే నాచారం హెచ్‌ఎంటీ నగర్ చెరువు రూ.30 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, సింగిరెడ్డి ధన్పల్ రెడ్డి, పావని రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్, సీనియర్ నాయకులు సీతారామ్ రెడ్డి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు కొబ్బరినూరి నాగ శేషు తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిపిఆర్ అవగాహన కార్యక్రమం






**మల్కాజ్గిరి, ఏప్రిల్17. అక్షర టైమ్స్:-** మల్కాజిగిరి అలైవ్ అరైవ్' కార్యక్రమం 5వ రోజు భాగంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే కీలకమైన కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) పై అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ త్రిముల్గిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. గాంధీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ సందీప్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులు, లా & ఆర్డర్ సిబ్బంది, 108 అంబులెన్స్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మరియు సుమారు 15 మంది అంబులెన్స్ డ్రైవర్లకు సిపిఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరేలోపు మొదటి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమని, ఆ సమయంలో సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు వివరించారు. సరైన పద్ధతిలో ఛాతీపై ఒత్తిడి కలిగించడం ద్వారా మెదడు మరియు ఇతర ముఖ్య అవయవాలకు రక్తప్రసరణ కొనసాగుతుందని తెలిపారు. పోలీసులు మరియు అంబులెన్స్ డ్రైవర్లు క్షేత్రస్థాయిలో మొదటి స్పందనదారులుగా పనిచేస్తారని, అందువల్ల వారికి ఈ ప్రాథమిక వైద్య పరిజ్ఞానం అవసరమని పేర్కొన్నారు. అనంతరం పాల్గొన్న వారికి ప్రాక్టికల్ శిక్షణ అందించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని పాల్గొన్న వారు తెలిపారు.

## వర్షాకాలానికి ముందే అప్రమత్తం - నాగారంలో అవగాహన జోరు





**నాగారం, ఏప్రిల్17.అక్షర టైమ్స్:** -ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం వార్డులో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు వేగవంతం అయ్యాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మల్కాజిగిరి మున్సిపల్ సంస్థ ఏంటమాలజీ విభాగం ముందస్తు చర్యలను మరింత కట్టుదిట్టం చేసింది.మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు, ఘట్‌కేసర్ ఉప కమిషనర్ వాణి ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇందులో భాగంగా నాగారం డివిజన్ పరిధిలోని అరవింద్ నగర్, దయార్కుంట ప్రాంతాల్లో ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు.ప్రత్యేక ప్రదర్శనల ద్వారా దోమ గుడ్డు నుంచి లార్వా దశ వరకు, అనంతరం పెద్ద దోమగా మారే ప్రక్రియను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ఏంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి తొలగిస్తూ ప్రజలకు సూచనలు అందించారు.ఓవర్ హెడ్ ట్యాంకులు, డబ్బాలు, కూలర్లు, పాత టైర్లు, పూల కుండీలు, కొబ్బరి బొండాలు వంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలనీలు, బస్తీలు, గేటెడ్ సముదాయాల్లో సంఘాల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సహకారాన్ని పెంచుతున్నారు.ఈ సందర్భంగా ఉప కమిషనర్ వాణి మాట్లాడుతూ, దోమల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత అని, వారానికి ఒకసారి ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో పోషణ పక్వాడలో పాల్గొన్న పిడి సిహెచ్ లక్ష్మి

**- కెవిఐబి వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు**

**- చిన్నారుల మెదడు అభివృద్ధికి తల్లిదండ్రులు దోహదపడాలి : సిడీపీవో పద్మావతి**





**ఏలేశ్వరం,ఏప్రిల్17.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపివో పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి,ఖాదీ చిన్న తరహా పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ప్రముఖ న్యాయవాది బుగత శివ హాజరయ్యారు.ఐసిడిఎస్ ప్రత్తిపాడు సెక్టార్ అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించిన ఈ పోషణ పక్వాడ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సూపర్ డేలో చిన్నారి తండ్రులను భాగస్వామ్యం,ప్యాకెట్ మరియు సంప్రదాయ చిరుతిల్లు మధ్య తేడా,ఆట బొమ్మల సేకరణ ద్వారా చిన్నారులను ఉత్తేజంపజేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు.పిల్లల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యత వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందని ఆరు సంవత్సరాల వయసు వచ్చేసరికి మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు అలవాట్లు స్క్రీన్,టీవీ మొబైల్ ఫోన్లకు మరియు ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.చిన్నారులు తాత అమ్మమ్మ నాయనమ్మలు చెప్పే మంచి మంచి కథల ద్వారా వాళ్లకు మెదడు అభివృద్ధి ప్రక్రియలో దోహదపడాలని సూచించారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.చిన్నారుల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యతలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు,ఏపీఎం జి శ్రీనివాసరావు,ప్రత్తిపాడ జగ్గంపేట సిడిపివోలు టిడిఆర్ పద్మావతి,యం పూర్ణిమ,కూటమి నాయకులు మూరా చంటిబాబు, గోపి, సూపర్వైజర్లు వరలక్ష్మి, సూర్యకుమారి, చక్రవేణి, మంగా రత్నం,సునీత,సిడిఎస్ టీచర్లు, హెల్పర్లు, పలువురు గర్భిణీలుబాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## కుక్కునూరులో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం పిల్లల ఆరోగ్యంపై అవగాహన







**కుక్కునూరు, ఏప్రిల్17. అక్షర టైమ్స్:-** కుక్కునూరు మండలంలోని కుక్కునూరు ప్రాజెక్టు పరిధిలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం సిడిపిఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంఆర్ఓ రమేష్ బాబు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, జనసేన పార్టీ అధ్యక్షులు యుగంధర్, భారత జనతా పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఏపీఎం భానుమతి, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారి ఆరోగ్యం బలంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లల జీవితంలో మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో సరైన సంరక్షణ తీసుకోవాలని సూచించారు. గర్భధారణ జరిగిన వెంటనే అంగన్వాడి వర్కర్ మరియు ఏ.ఎన్.ఎం వద్ద పేరు నమోదు చేసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, టిటి ఇంజెక్షన్లు పొందడం చాలా అవసరమని చెప్పారు. అలాగే ప్రసవానికి ముందుగానే సిద్ధం కావాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం ఎంతో ముఖ్యమని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఏడవ నెల నుండి అనుబంధ ఆహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని వివరించారు. తల్లిపాలు వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. రెండు సంవత్సరాల లోపు పిల్లల మెదడు సుమారు 80 శాతం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, ఈ దశలో సరైన ఆహారం, సంరక్షణ చాలా అవసరమని తెలిపారు. జంక్ ఫుడ్‌కు బదులుగా ఇంటి ఆహారం పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. చిన్న పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడం వారి శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, కుటుంబ సభ్యులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం ద్వారా ఈ అలవాటును తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర అతిథులు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తల్లులకు సూచిస్తూ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## పొదలకూరు నాగార్జున స్కూల్ లో నేడు వార్షికోత్సవ వేడుకలు..





**పొదలకూరు,ఏప్రిల్17.అక్షర టైమ్స్:-** పొదలకూరులోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఈ ఏడాది వార్షికోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. దీంతో పాఠశాల ప్రాంగణం గత రెండు రోజులుగా పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.ఎక్కడ చూసినా విద్యార్థుల ఉత్సాహం,ఉపాధ్యాయుల బిజీ పనులు కనిపిస్తూ సందడి సందడిగా మారింది.ఈనెల 18వ తేదీ శనివారం జరగనున్న వార్షికోత్సవానికి నెల రోజుల ముందుగానే ప్రణాళికలు ప్రారంభించారు. ప్లే క్లాస్ నుంచి టెన్త్ క్లాస్ వరకు ఉన్న విద్యార్థులను విభిన్న బృందాలుగా విభజించి, ప్రతిభను వెలికితీసేలా శిక్షణ అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం పిల్లలు ప్రతిరోజూ ఉత్సాహంగా సాధన చేశారు. పాటలు, నృత్యాలు, స్కిట్స్ వంటి విభిన్న అంశాల్లో ప్రత్యేక ప్రదర్శనలు సిద్ధం చేశారు.నెల్లూరు, పొదలకూరు ప్రాంతాలకు చెందిన అనుభవజ్ఞులైన డాన్స్ మాస్టర్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో ప్రతి ప్రదర్శనలో ప్రొఫెషనల్ టచ్ కనిపించనుంది. మరోవైపు కరాటేలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు నెల్లూరుకు చెందిన కింగ్స్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు సత్య, రమ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.వార్షికోత్సవ వేదికపై కరాటే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి వార్షికోత్సవ వేదికపై బహుమతులు అందజేసి ప్రోత్సహించనున్నారు.వేడుకలకు అనుగుణంగా భారీ వేదిక ను నిర్మించారు. సౌండ్ సిస్టమ్, లైటింగ్, అలంకరణలతో అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానుండటం వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకురానుంది.శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పాఠశాల యాజమాన్యం ఆహ్వానిస్తోంది. గతంలో ఎప్పుడూ చూడని విధంగా అట్టహాసంగా ఈ వేడుకను నిర్వహించాలని యాజమాన్యం సంకల్పించింది. నాగార్జున స్కూల్ వార్షికోత్సవం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా విద్యార్థుల ప్రతిభకు వేదికగా, వారి కలలకు రంగులు అద్దే ఒక సాంస్కృతిక పండుగగా నిలవనుంది.

## స్వీయ నమోదుపై ప్రజలకు అవగాహన..



**శంఖవరం,ఏప్రిల్17.అక్షర టైమ్స్:-** జనగణన నమోదు ప్రక్రియలో రెండవ బ్యాచ్ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో స్వీయ నమోదుపై డిప్యూటీ తహసిల్దార్ ఎస్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రం శంఖవరంలోని సచివాలయం 1లో జనగణనలో పాల్గొనే రెండవ బ్యాచ్ రెవెన్యూ, సచివాలయాల సిబ్బందికి ఫీల్డ్ ట్రైనర్లు తుమ్మల వెంకట రామన్న, కుర్రే వెంకటేశ్వర్రావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో డిటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జనగణన 2027లో భాగంగా ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు హౌస్ హోల్డ్ స్వీయ గణన ఉంటుందని, మే 1 నుండి 30వ తేదీ వరకు ప్రజలు అధికారులు భాగస్వామ్యంతో జనగణన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన జనగణన సిబ్బంది శంఖవరంలోని వైష్ణవ మాన్యం కాలనీకు చేరుకుని స్వీయ నమోదు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరు, ప్రతి కుటుంబం జనగణన నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ మురళి, రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

